తెల్లబోయిన మల్లయ్య..

''గా పైసల్ మనం ముట్టొద్దు బిడ్డా...'' అని కంగారుగా అనబోతే..

''ఇగ వేరే ఆలోచనే లేదు. నువ్వు బోయి గా అంబులెన్స్ తీసుకొచ్చుడు.. అమ్మను మనం గిప్పుడు మన ఊరికి తీస్కబోయి, అవ్వకు జూపించుడు జరగాలె. గంతే!'' తన నిశ్చయానికి తిరుగు లేదన్నంత కచ్చితంగా ఒత్తి పలికింది పుష్ప.

కూతురి నిర్ణయానికి తిరుగుండదని తెలుసు మల్లయ్యకు. కూతురి పెళ్లికోసం దాచిన డబ్బు ఖర్చయి పోతున్నదేనన్న బాధ, ఆ పిల్ల పట్ల జాలి నిండిన ప్రేమ, భార్య కోరికను తీర్చకుండా ఉండలేని అశక్తత ముప్పేటలుగా మనసును కమ్మేయ్యగా.. కూతురి తల నిమిరి, భార్య చేతి మీద మృదువుగా, ఆత్మీయంగా తడుతూ..

''నిన్ను నీ అత్తమ్మ కాడికి తీస్కపోతున్నాం సారమ్మా!'' అన్నాడు మల్లయ్య.

అంత అనారోగ్యంలోనూ ఉబికిన ఉత్సాహంతో భర్త చేతిని అందుకున్నది సారమ్మ.

* * *

పేషెంట్ సారమ్మనూ, మల్లయ్య, పుష్పనూ అంబులెన్సులోకి ఎక్కించి, కొంచెం ఎడంగా పోయి.. తన భార్య పద్మశ్రీకి ఫోన్‌చేసి వివరాలతో శుభవార్త చెప్పి..

''గీ మాత్రం దూరానికి కిరాయి ఎంతో ఎరుకనా? ఇరవై వేలు'' అన్నాడు పరమేశ్.. లోనుంచి తన్నుకొస్తున్న ఆనందాన్ని బలవంతాన అదుపుజేసుకుంటూ.

''నిజమేనా.. గప్పాలా?'' నమ్మలేక పోయింది అతగాడి ధర్మపత్ని.

''ఇంటికి పైసల్ దెస్త గదా. గంత నమ్మకం లేదా? గీడ ఊరోల్లు దొరికిన్రు''.

''అబ్బో.. కరోనా రోజుల్నుంచెల్లి నీగ్గూడా దిమాక్ మంచిగనే పంజెయ్యబట్టినట్లున్నదే!? కరోనా గిరాకీల తోని ఇల్లు గట్టినవ్. ఇంక గిసుంటి బేరాలు మూడు నాలుగు తలిగితే.. నా ఒడ్డానానికి గూడ పైసల్ సరిపోతయి!''.

''నువ్వు సన్నబడరాదు.. గప్పుడే సరిపోతయి!'' కిచకిచ నవ్వాడు.

''సంపుత!..'' తనూ నవ్వింది.

''మల్లెపూలు, తెల్ల చీరతోని సోగతం పలకాలె నాకు రాత్రికి''.

''ఛీ.. సిగ్గు లేదు. గసుంటి మాటల్ మాట్లాడుతరా పోన్ల? పెట్టెయ్యి పోను!'' నవ్వుతూ కసిరింది పద్మశ్రీ.

ఈ రాత్రికి ఇంటి దగ్గర గడపబోయే సరస సన్నివేశాలను ఊహించుకుంటూ, ఈలపాట సాయంతో వచ్చి.. అంబులెన్స్‌ను ముందుకు ఉరికించాడు పరమేశ్.

**''అత్తమ్మనే అమ్మా.. నేనే తల్లీ! గిట్లయిపోయినవేందే అమ్మా. సిక్కి కంపయిపోయినవ్. ఇగ నువ్వే దవ్వఖానకూ పోవద్దు బిడ్డా.. నేను జూసుకుంటా.. ఆఁ.. కండ్లల బెట్టుకుని నా బిడ్డను జూసుకుంటా!'' గద్గద స్వరంతో అంటూ, సారమ్మను పొదివి పట్టుకున్నది యాదమ్మ.**

సారమ్మ వైపే ఆశగా చూస్తూ, కూర్చుని ఉన్నారు తండ్రీకూతుళ్లు.

తగ్గిందనుకున్న వాన మళ్లీ పెరిగి, రెచ్చిపోయి కొడుతున్నది. బండి ఘట్‌కేసర్ దాటింది.

''అన్నా! అమ్మ కండ్లు జూస్తాంటే బయమైతాంది. జర సూడన్నా''.. పరమేశ్‌తో గాభరాగా అన్నది పుష్ప.

''అవ్! గట్ల పెడ్తందేంది కండ్లను?!'' అన్నాడు మల్లయ్య కూడా ఆందోళనతో.

బండిని ఆపి, వచ్చి.. సారమ్మ మొహంలోకి చూస్తూ..

''సచ్చిపోయిందా ఏందీ?'' అని గొణిగాడు పరమేశ్.

ఆ మాటలకు కెవ్వుమన్నది పుష్ప.

''గట్లనకయ్యా'' అన్నాడు మల్లయ్య కంగారుగా.

''సూడనీకి గట్ల కండ్లబడితే అన్ననంతే..'' అంటూ పనిచెయ్యని ఉత్తి ఆక్సిజన్ ట్యూబులను అటూఇటూ కదిపి..

''మంచిగ ఎక్కుతాంది ఆక్సీజను. ఇగ మన అదురుస్టం మల్ల!''.. చక్కగా అబద్ధమాడాడు పరమేశ్. ఆపైన..

''గిట్లంటున్నని తప్పుగా అనుకోకున్రీ.. చెప్పలేదంటరు. దార్ల పేషంటు గిట్ల సచ్చిపోతే మూడొందలు ఎక్కువియ్యాలె''.

అతని మాటలకు చాలా బాధపడుతూ.. సారమ్మ ముఖంలోకే చూస్తున్నారు తండ్రీకూతుళ్లు భయంభయంగా, బెంగగా.

ఎలాగైతేనేం.. పడుతూ లేస్తూ చివరికి గమ్యం చేరింది అంబులెన్స్. వాన పూర్తిగా తగ్గింది కూడా.

''జల్దీ పేషెంటును దింపుకొని పైసలిచ్చి పంపున్రి నన్ను!'' అని తొందరపెట్టాడు పరమేశ్.. జేబులో మోగుతున్న ఫోన్ తీసుకుని మాట్లాడటానికి దూరంగా వెళ్తూ..

పొరుగువారి సాయంతో సారమ్మను జాగర్తగా మోసుకు వెళ్లి, కుక్కి మంచం మీద గోడకు జారగిలబడి, కట్టున్న కాలు జాపుకొని కూర్చుని ఉన్న తన తల్లి యాదమ్మ పక్కనే పడుకోబెట్టాడు మల్లయ్య. చలనం లేని సారమ్మలో ప్రాణం ఉందా లేదా అన్న అనుమానం అందర్లోనూ పీకుతూనే ఉన్నది.

''అమ్మ అమ్మ.. నా కోడలచ్చినదా!? నా బంగారు తల్లచ్చినదా..'' అంటూ కళ్ల నీళ్లయిపోతూ, ఆమె తలను ఒళ్లోకి తీసుకుని, నుదుటిమీద తన చల్లని చేత్తో రుద్దసాగింది యాదమ్మ.

అంతే!.. వింతగా చలనమొచ్చింది సారమ్మలో. నెమ్మదిగా కండ్లు తెరిచింది. అత్తను చూసింది. పెల్లుబికిన ఆనందంతో ఆమె చెంపలు అదిరాయి. ''అ..త్త..మ్మా'' అనడానికి ఆమె పెదవులు కదిలాయి.

ఆ పెదవుల కదలిక అర్థమైన యాదమ్మ..

''అత్తమ్మనే అమ్మా.. నేనే తల్లీ! గిట్లయిపోయినవేందే అమ్మా. సిక్కి కంపయిపోయినవ్. ఇగ నువ్వే దవ్వఖానకూ పోవద్దు బిడ్డా.. నేను జూసుకుంటా.. ఆఁ.. కండ్లల బెట్టుకుని నా బిడ్డను నేనే జూసుకుంటా! నూరేండ్లు బతుకుతది బిడ్డ..'' గద్గద స్వరంతో అంటూ, సారమ్మను పొదివి పట్టుకున్నది యాదమ్మ.

ఆ ఆత్మీయతకు సారమ్మలో నూతనోత్సాహం వచ్చింది.

''అత్తమ్మా'' అంటూ ప్రయత్న పూర్వకంగా చేతులతో ఆమె విరిగిన కాలిమీద సుతారంగా రాస్తూ, దుఃఖంతో ముఖాన్ని ఆమె ఒడిలో దాచుకుంటూ, వెక్కుతూ నీరసంగా..

''ఇరిగిన కాలుతోని ఇంటికాడ పెద్దదానివి నువ్వొక్కదానివే ఉండి ఏం కట్టాలు పడుతున్నావోనని గక్కడ నా పానం కొట్టుకుంటనే ఉంది.. నిన్ను జూస్కోనీకి నేనుండొద్దా మల్ల!'' అన్నది.

భళ్లున ఇద్దరూ ఆత్మీయంగా బావురుమన్నారు.

సారమ్మ ఆరోగ్యస్థితిలో వచ్చిన గొప్ప మార్పులకు సంభ్రమాశ్చర్యాలకు గురవుతూ.. మల్లయ్య, పుష్ప వెన్నెల విరిసినట్లు నవ్వుతూనే ఏడవసాగారు.. ఏడుస్తూనే నవ్వసాగారు!

''అమ్మకు మంచిగైతదిగ. నువ్వు సేట్ కాడికి గా అంబులెన్స్ డ్రైవర్ను తీస్కపోయి, కిరాయిప్పించి రా అయ్యా!'' అన్నది పుష్ప.

''అవ్ బిడ్డా! గీ సంబురంల గా సంగతే మరిచిన. ముందుగాల ఆయినెకు మజ్జిగో మంచినీల్లో ఇయ్యాలె పాపం!'' అంటూ బయటికి గబగబా నడిచాడు మల్లయ్య.

కానీ, అక్కడ పరమేశ్ లేడు. అసలు కనుచూపు మేరలో అంబులెన్సే లేదు.

''ఏదో పోనొచ్చినాది.. మాట్లాడి, పరేషాన్‌తోటి బండి దీస్కొని ఇస్పీడుగ ఎల్లిపోయిండు'' అని చెప్పాడు పక్కింటి అబ్బాయి.

మల్లయ్యకేం తెలుసు.. ఆ వచ్చిన ఫోన్ హైదరాబాద్‌కు ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊర్లోని పరమేశ్ ఇంటి నుంచి, అతగాడి తమ్ముడు చేశాడనీ..

'వదినమ్మను పాము కరిచిందన్నా. ఈడ వాన బీబత్సంగ, భయంకరంగ కొడుతున్నది. రోడ్ల మీద చెట్లు, స్తంబాలు పడిపోయినయ్. ఏ బండీ కదిలేటందుకు జాగ లేదు. ఆమెను జల్దీ హైదరాబాద్ తీస్కపోన్రనీ.. లేకుంటే ఆమె పానానికి ఏమైతదో చెప్పలేమని మన పక్కింటి డాక్టర్ సాబ్ అంటుండన్నా!' అని ఏడుస్తూ చెప్పాడని!?

'అరే.. పిచ్చోడు. పాపం.. పైసల్ తీస్కునుడు మర్చిపోయిండా ఏందీ? చ్చ..చ్చ.. పోన్ నెంబరన్న తీసుకోక పోతిని' అని నొచ్చుకుంటూ.. అలాగే పైకి చూస్తూ ఉండిపోయాడు మల్లయ్య.

అతని కండ్లెదురుగా.. ఆకాశంలో మబ్బులు తొలగి నవ్వుతూ బయటికి వస్తున్న చందమామ. ■

## తులసి బాలకృష్ణ



రచయితగా, రంగస్థల నటుడిగా, దర్శకుడిగా తెలుగువారికి సుపరిచితులు తులసి బాలకృష్ణ. నాలుగున్నర దశాబ్దాలుగా కళా సేవలో తరిస్తున్నారు. వీరి స్వస్థలం హైదరాబాద్. బ్యాంక్ మేనేజర్‌గా పనిచేసి, విరమణ పొందారు. ఇప్పటివరకూ 500లకు పైగా కథలు, 40 నాటికలు, 8 నవలలు, 3 నాటకాలు, కొన్ని రేడియో నాటకాలు, టీవీ నాటకాలు రాశారు. మొదటి కథ 'నైజం', స్వాతి మాస పత్రికలో ప్రచురితమైంది. వంశీ సంస్థ నిర్వహించిన కథల పోటీలో మొదటి బహుమతి దక్కించుకున్నది. 'తులసీ దళాలు', 'గిలిగింతలు' కథల సంపుటాలను వెలువరించారు. 'పురుషులందు..' కథ, 'సంచలన చిత్రం' సీరియల్ విశేష ఆదరణ పొందాయి. అన్ని ప్రముఖ తెలుగు దిన, వార పత్రికలతోపాటు ఆన్‌లైన్ పత్రికల్లో వీరి రచనలు ప్రచురితమయ్యాయి. నాటకాలలో వేషాలు, దర్శకత్వం, గుణ నిర్ణయ కర్తృత్వం నిర్వహిస్తుంటారు. కొన్ని టీవీ సీరియల్స్‌లోనూ నటించారు. ప్రాణమున్నంత వరకూ కళా రంగాన్ని విడిచిపెట్టబోనని చెబుతున్నారు తులసి బాలకృష్ణ.